పూల యందున పరిమళ మెట్లు గలదో
అటుల దేవుండు నీలోన కలడు జూడ
మెదడు చెడిపోయి కస్తూరి మృగము వోలె
ఏల వెతికెదు దేవుని వెఱ్ఱివాడ.

కట్టెలందున నిప్పులు కల్గినటుల
తిలలయందున తైలంబు వెలయు పగిది
ఎందు చూచిన దైవంబు నిండియుండె
ఎచట వెతుకెదు దేవుని వెఱ్ఱివాడ.

ప్రేమస్వరూపులారా!

ప్రపంచములో ప్రతి కణమునందును ప్రతిష్ఠయై యున్న దివ్యత్వమును మానవుడు గుర్తించుకోలేక పోతున్నాడు. ప్రపంచమంతయు కూడను దివ్యమైనట్టి వంటిది ఈశ్వరస్సర్వభూతానాం. ఇట్టి సత్యాన్ని ప్రతి మానవుడు చక్కగా విచారణ చేసిన తనకు యిట్టి దివ్యత్వము బోధపడుతుంది. భౌతికమైన యీ జగత్తునందు లౌకికమైన పరిశీలనలోపల సమస్తమును అర్థము గావించుకొని కేవలం తనయందున్న దివ్యత్వమును మటుకు విస్మరించి మానవుడు జ్ఞాని వలె ప్రకటితం చేస్తున్నాడు.

మానవుడు యీ జగత్తునందు చేయు ప్రతి కర్మ కూడా ఒక యజ్ఞములో సమానము. బయటు చేయు కర్మలన్ని అంతర్ముఖమైన కర్మలయొక్క ప్రతిబింబమంతే. బయటు కర్మయజ్ఞము. లోపల బ్రహ్మయజ్ఞము. కాని యజ్ఞతత్త్వము చక్కగా గుర్తించి వర్తించటం వ్యక్తులకు అర్థం కావటం లేదు. మానవత్వమునందెట్టి దివ్యత్వము యిమిడియున్నదో అట్టి దివ్యత్వమే సర్వత్రా వ్యాపించిన పరతత్త్వమనే సత్యాన్ని వారు గుర్తించుకోటానికి ప్రయత్నించటం లేదు. దేహేంద్రియములే ప్రధానమని భావించి వాటిని తృప్తి పరచుటకు తగిన భోగభాగ్యముల నిమిత్తమై మానవుడు తన కాయమును కాలమును కర్మను కూడా వ్యర్థము గావించుకుంటున్నాడు. భౌతిక జీవితములో యేర్పడిన సుఖసంతోషములు మానవునకు తృప్తినిచ్చుచున్నవా యని విచారణ చేసిన యేమాత్రం తృప్తిని కలిగించటం లేదు. కేవలం యిక్కడ ఆధ్యాత్మిక మార్గంలో మనం విచారణ సలిపిన ఒకటి ఆనందము, రెండవది సంతోషము. ఈ సంతోషము సుఖము ద్వారా యేర్పడినదేనని భావిస్తున్నారు. ప్రపంచములో గల సమస్త పదార్థములు సుఖమును మాత్రము అందించగలవుగానీ ఆనందమును అందించలేవు. ఆనందమన్నది వస్తువుల యందుగాని, విషయములందుగాని, వ్యక్తులయందుగాని కానరాదు ఆనందమన్నది

606108902

తన నుండి ఆవిర్భవించేటు వంటి ఆత్మ తత్త్వమే తప్ప అన్యము కాదు. మార్పుచెందే పదార్థములు మార్పు చెందని పరతత్త్వమును ఏ రీతిగా అందించగలవు. కనుకనే యిట్టి నిత్యసత్యమును గుర్తించుకునే నిమిత్తమై వేదములందు అనేకరకములైన మార్గములు ప్రబోధిస్తూ వచ్చాయి.

మానవుని యందిట్టి పశుత్వమైన భావములు గుణములు అభివృద్ధి కావటానికి కారణమేమిటని విచారించమని మొట్టమొదటి ప్రశ్న వేసింది వేదము. పుట్టిన తక్షణమే మానవుడు మానవునిగా జన్మించటంలేదు. ఈ మానవత్వమునకు పూర్వము అనేక జంతు లక్షణములు జంతు జన్మములు కూడా ఎత్తి కట్టకడపటికి యీ మానవ జన్మములో ప్రవేశిస్తున్నాడు. కనుకనే శేషించిన యీ పశులక్షణాలు మనలో వుండటము చేత యీ విధమైన దుర్గుణములు ఆవిర్భవిస్తున్నాయి. ఒకరు చూచిన నిరంతరము చంచల చిత్తులై కేవలం స్థిరత్వము లేక తాను జీవిస్తూ వుంటాడు. అస్థిరత్వము నిమిత్తమై అనేక ప్రయత్నములు గావిస్తూ వుంటాడు. కాని స్థిరత్వం యేర్పడటం లేదు. దినదినమునకు యీ చంచలత్వమే అభివృద్ధి అవుతు పోతుంది. దీనికి కారణమేమని విచారించినప్పుడు వేదమే దీనికి సరైన జవాబు నందిస్తూ వచ్చింది. పూర్వము తను కోతి జన్మముగా రూపొందటము చేత ఆ కోతి యొక్క లక్షణములు తనలో వుండి యీ చంచలత్వానికి మూలకారణమైందని జవాబు యిస్తుంది. అదేవిధముగనే మానవునియందు మూర్ఖత్వము లేక పిరికితనముగాని లేక దొంగబుద్ధిగాని యింకేవిధమైన యీ దుర్లక్షణములంతా కనుపించినాయంటే దీనికి మూలకారణము పూర్వము తాను యీ విధమైన జంతు జన్మములో శేషించిన శేషముతో యీ ప్రవర్తనకు మూలకారణమని అర్థమవుతుంది. ఇట్టి దుష్ట సంస్కారములను మనము భగవదర్పితము గావించటమే దీనికి సరైన పరిహారమని నిర్ణయిస్తుంది. దొంగతనమే గుణము మనిషిలో అనేకమందికి ఆవిర్భవిస్తూ వుంటాయి. ఈ దొంగతనమనేది పిల్లి యొక్క లక్షణములు చంచలత్వమనేది కోతి యొక్క లక్షణములు. మూర్ఖత్వము గొర్రె యొక్క లక్షణము మదము అనే గుణము దున్నపోతు లక్షణములు. ఈ విధముగా పూర్వజన్మ సంస్కారము పురస్కరించుకొని దాని యొక్క స్వభావముతో సంస్కారముగా మారి మానవుని యందు చిత్రింపబడుతూ వుంటున్నాయి.

యజ్ఞములో రెండు విధములైన యజ్ఞములు కలవు. ఒకటి బాహ్య సంబంధమైన యజ్ఞము, రెండవది అంతర సంబంధమైన యజ్ఞము. ఈ బాహ్యసంబంధమైన యజ్ఞమునకు కొన్ని వేదికలు, పురోహితులు, సమిధలు, దీనికి తగిన పదార్థములు అత్యవసరం. ఈ మంత్రముల చేత స్వాహాకారములచేత అర్పితము గావిస్తూ వుంటారు. హోమం చేస్తూ వుంటారు. ఇది అంతర్యాగమైన యజ్ఞము యొక్క ప్రతిబింబమే. ఐతే అంతర్ యజ్ఞము యొక్క విషయము వలనే మాత్రం కాదా

606108903

విచారించటం లేదు. తన యందున్న దైవత్వాన్ని స్మరించి, తన మనసునే యజ్ఞవేదికగా నిర్మించి దానియందు శేషించిన దుష్టగుణములను బలిచేయుటయే యజ్ఞము యొక్క అంతర్భావము. కనుకనే దుష్టగుణములను, దుష్టస్వభావమును, దుష్టప్రవర్తనను మనం మార్చుకొని దివ్యమైన మానవత్వాన్ని ప్రకటితం గావించుకునే నిమిత్తమై యేర్పడినవే ఈ యజ్ఞములు. చంచలత్వము మానవుని యొక్క స్వభావము కాదు. క్రోధము మానవుని యొక్క స్వభావము కాదు. దొంగతనము కూడను మానవుని యొక్క స్వభావము కాదు. మూర్ఖత్వమంతకంటే మానవుని స్వభావము కాదు. ఇవన్నీ కూడా మానవుని యొక్క స్వభావం కాని దుర్గుణములన్నిటిని మానవుడు అనుభవిస్తున్నాడంటే దీనికి మూలకారణము పూర్వజన్మ సంస్కార ఫలములే. కనుక మనం చేయవలసిన త్యాగమేమంటే మనలో నిండివున్న, మనలను బాధించే, మానవత్వాన్ని మరపింపచేసే ఈ దుర్గుణములను మనం త్యాగము చేయాలి.

దీనికి చక్కని ఉదాహరణము. మనలో ఒక విధమైన ఆశ్రమము వుంది. ఈ ఆశ్రమ మనగా యేమిటి? శ్రమను పోగొట్టేది ఆశ్రమము. ఆశ్రితులను రక్షించేది ఆశ్రమము. ఆశలన్ని చేకూర్చేది ఆశ్రమము. మన అభీష్టములు నెరవేర్చేది ఆశ్రమము. ఐతే ఇది సామాన్యమైన ఆశ్రమము కాదు. నేను, నేను అనే ప్రజ్ఞ ఎక్కడనుండి ఆవిర్భవించిందో దానినే ఆశ్రమము అన్నారు. సమస్త అభీష్టములను సిద్ధింపచేసే ఈ ఆశ్రమమునే సిద్ధాశ్రమము అని పిలుస్తూ వచ్చారు. ఈ సిద్ధాశ్రమము లో విశ్వామిత్రుడు వుండేవాడని చరిత్ర. ఈ విశ్వామిత్రుడంటే ఎవరు? కేవలము ఒక వ్యక్తియా? ఒక మునియా? లేక ఒక ఋషియా? కాదు కాదు. అతని యందున్న ప్రజ్ఞాన శక్తిని ప్రభువుపైన మరల్చినప్పుడు తానే విశ్వామిత్రునిగా మారతాడు. అట్టి తమ దృష్టి దివ్యత్వంపై మరల్చి యజ్ఞం గావించాలని తాను ప్రయత్నం చేస్తాడు. ఈ యజ్ఞ సంరక్షణ నిమిత్తమై రామచంద్రుని ప్రార్థిస్తాడు. ఆ రాముడెవరు? కేవలం ఒక వ్యక్తి స్వరూపుడు కాదు. ఆత్మనే రమింపజేసే గుణము కలవాడు. కనుక అతనికి ఆత్మారాముడని బిరుదు. ఈ ఆత్మనాశ్రయించినప్పుడు తన యజ్ఞము సఫలీకృతమవుతుందనే విశ్వాసం విశ్వామిత్రునికి. కనుకనే అట్టి దృష్టిని దివ్యత్వముపై మరల్చుటం చేత రాముడు అక్కడ ఆవిర్భవిస్తాడు. అక్కడ ఆవిర్భవించి మారీచ, తాటకిని హతమారుస్తాడు. ఈ మారీచ తాటకులెవరు. ఇవే రాగద్వేషములు. ఈ రాగద్వేషములనే నాడు హతము గావించునో అప్పుడే విశ్వామిత్రుని యాగము పరిపూర్ణమైంది. కనుక మానవుని యందే సర్వము ఇమిడి వుంటున్నాయి.

మానవుని యొక్క వాక్కే ఋగ్వేదము. మనసే యజుర్వేదము. ప్రాణమే సామ వేదము. మూడింటి యొక్క ఏకత్వమే దివ్యమైన ఆత్మతత్త్వము. కనుక ఋగ్వేద, యజుర్వేద సామ వేదములన్నీ కేవలం ఒక స్వరూపము ధరించిన మాన

606108904

వత్వమే. మానవుని యందే సర్వము యిమిడి వుంటుంది. మానవుని యందు లేని దివ్యత్వ
ము యింక యెక్కడా మనకు కనుపించదు. సమస్త శక్తులకు నిలయుడు మానవుడు
సమస్త దివ్యగుణములకూ నిలయము మానవుడు. అట్టి మానవుని మానవునిగా గుర్తిం
చక దానవునిగా ప్రవర్తించటం యిది సరియైనది కాదు. కావునే యిట్టి మానవుని యం
దు నిరంతరము బ్రహ్మయజ్ఞం జరుగుతూనే వుంది. ఇది సర్వకాల సర్వావస్థల యందు
యీ నామ ఉచ్ఛరణ జరుపుతూ ఆహుతి సల్పుతూనే వుంటుంది. స్వాహాకారములు
సల్పుతూనే వుంటుంది. ఆస్వాహాకారమే శ్వాసాకారము. అదే సోహం. సోహం. యీ శ్వాస
యందున్న సో నేనే దైవము నేనే దైవము అనే దివ్యమైన మంత్రం చేరనే ఆహుతి
చేస్తున్నది. కనుక వేదములనేవి కేవలం ఒక గ్రంథ రూపంలో కాకుండా మానవుని
యందు భావరూపములో యిమిడి వుంటున్నాయి.

దీనికి మరొక ఉదాహరణము. యజ్ఞములో మాటిమాటికి ఇంద్రుని ఆ
హ్వానం చేస్తూ వుంటారు. ఈ ఇంద్రుడనగా ఎవరు? ఏదో ప్రత్యేకమైన దేవతకాదు. ఇం
ద్రియముల కధిపతి. మన మనస్సే యింద్రుడు. ఈ యింద్రునికి మరొక పేరు కూడా
వుంది పురుహూతుడు అని. పురు అనగా మాటిమాటికి పిలవటం. హూతుడు
అనగా ఆహ్వానం చేయటం. అనేక పర్యాయములు ఆహ్వానం చేయించుకునే వాడు
కనుకనే యితనికి పురుహూతుడు అని మరొక పేరు. ఈ ఇంద్రునికి మరొక పేరు
కూడా వుంది. రుద్రుడు. ఇంద్రియముల కధిపతిగా వున్న మనస్సు ఇంద్రునిగాను
ఇంద్రియములను స్వాధీనం చేసుకున్న, సర్వత్రా వ్యాపించిన తత్వమునకే రుద్రుడు అని
పేరు. ఏతావాతా మనస్సు, ఇంద్రుడు, రుద్రుడు ఒక్కరే. ఆయా కర్మలాచరించే సమయ
ములో ఆయా పేర్లను ధరిస్తుంటుంది. ఒక చిన్న ఉదాహరణము. లౌకిక జగత్తునందు
చిన్న ఆదర్శమును తీసుకుందాము. ఒక బ్రాహ్మణుడు వుంటాడు. ఒక దేవాలయములో
పూజ చేస్తూ వుంటాడు. అతనిని పూజారి బ్రాహ్మణుడని అంటారు. ఇంకొక చోట పం
చాంగము చదువుతూ వుంటాడు అతనిని పంచాంగం బ్రాహ్మణుడంటారు. మరొక
చోట వంట చేస్తుంటాడు అతనిని వంట బ్రాహ్మణుడంటారు. మరొక చోట విద్య
నేర్పుతూ వుంటాడు. అక్కడ అధ్యాపక బ్రాహ్మణుడంటారు. ఈ పనులను బట్టి
యీ పేర్లు వచ్చాయి గాని అందరూ బ్రాహ్మణులే. అదే విధముగనే మనసు, ఇంద్రుడు
రుద్రుడు అనేవి వారు చేసే కర్మలను పురస్కరించుకొని వారికి పేర్లు వచ్చాయి.
కనుక క్రియా రూపంలో ఆవిర్భవించే దివ్యత్వాన్ని బట్టియే మన యొక్క మంచి చెడ్డ
లు కూడా రూపొందుతూ వుంటాయి. కనుక అన్నింటికిని కర్మయే ప్రధానము.
కనుక వేదమునందు కర్మకాండను ప్రధానమైన స్థానములో పెట్టారు. ఇట్టి కర్మకాం
డయందే దివ్యమైన మానవాకారము కూడను నిరూపిస్తూ వచ్చింది.

దశరథుని యింటిలో రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులనే నల్గురు

బాలురు నిరంతరము సంచారం సల్పుతుంటారు. ఆడుతూ వుంటారు. పాడుతూ వుంటారు. ఆనందిస్తూ వుంటారు. ఎవరు వీరు అని విచారణ చేస్తే వేదమే వీరియొక్క స్వరూపాన్ని నిరూపణ గావిస్తూ వచ్చింది. సాక్షాత్తు ధర్మమునే ఆకారముగా ధరించినవాడు రాముడు ఇతడే యజుర్వేదము. ఈ యజుర్వేదమునే రామనామమును ఆశ్రయించి తన వాక్యమును తన కార్యమును నిరంతరం వల్లెవేసేవాడు లక్ష్మణుడు. ఇతడే ఋగ్వేదము. రామనామమునే ఒక గానముగా వుచ్చరించుకుంటూ, యీ గానములో తన జీవితమును లీనము గావించుకున్న వ్యక్తి భరతుడు. ఇతడే సామవేదము. అంతర్ బహిర్ శత్రువులను అణగద్రొక్కి యీ ముగ్గురి ఆజ్ఞలను శిరసావహించి శత్రుసంహారం గావించిన శత్రుఘ్నుడే అథర్వణవేదము కనుక ఋగ్వేద, సామవేద, యజుర్వేద, అథర్వణవేదములన్న కూడను రామలక్ష్మణ భరత శత్రుఘ్నుల స్వరూపములో యీ దశరథుని యింటిలో ఆడుకుంటున్నారు. ఇక యీ దశరథుడు ఎవరు? ఇతడొక చక్రవర్తి కాడు. ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు యీ దశేంద్రియములు చేరిన రథమే యీ దేహము. ఇదే దశరథుడు. దశేంద్రియ రథమైన యీ దేహమునందు ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వణవేదములనే బాలురు రామలక్ష్మణ భరత శత్రుఘ్నులుగా ఆవిర్భవించారని అర్థము. వీరు సూర్యవంశపు వారని పేరు. ఇక్కడ సూర్యుడనగా బాహ్య సంబంధమైన రూపములో మనం విచారించినప్పుడు సూర్యుడున్నాడు చంద్రుడున్నాడు. భూమి వున్నది. ఈ భూమి ఎక్కడనుండి వచ్చినది? సూర్యుని నుండి వచ్చినది. ఈ చంద్రుడెక్కడనుండి వచ్చాడు? భూమినుంచి వచ్చాడు. కనుక చంద్రుడు, భూమి సూర్యుని నుండి ఆవిర్భవించినవే. సూర్యునిలోని కొన్ని భాగములే. నిజముగా విచారణ చేస్తే సూర్యుడే లేకపోతే యీ జగత్తే లేదు. జనన మరణములే లేవు. ఏవిధమైన ఆకారమే లేదు. కనుక సూర్యుని ప్రధానమైన దేవతగా ఆశ్రయిస్తూ వచ్చారు. సూర్యుడే ప్రత్యక్ష దైవంగా విశ్వసిస్తూ వచ్చారు. ఈ సూర్యుని యొక్క అంశములు ప్రతి మానవుని యందు వుంటున్నవి. ప్రతి మానవుడు కూడను సూర్యుని యొక్క కిరణముల నుండి ఆవిర్భవించినవాడే. మనలో వున్న వెలుగే సూర్యుని యొక్క కిరణము. అతని వెలుగు మనలో వుండటంచేత అతని అంశము కూడను మనలో వుంటున్నది. సూర్య అంశమైన ప్రతి మానవుడు కూడను సూర్యవంశమునకు చెందినవాడే. రాముడు ఎవరంటే సూర్యవంశము వాడన్నారు. కనుక ప్రతి మానవునియందు ఆత్మారామ అనే తత్త్వము సూర్య అంశములో కూడినది కనుక అది సూర్యవంశముగా రూపొందింది. కనుక రాముడనగా కేవలము దశరథ మహారాజు కుమారుడే కాదు. మీరందరూ రామస్వరూపులే. మీ అందరియందు యీ సూర్య అంశము నిలచి వున్నది. అట్టి సూర్య అంశమునే సూర్యవంశముగా విశ్వసించి సూర్యవంశపు రాజైన రామచంద్రుడే విధముగా దుష్టసంహారం గావించాడో, శిష్టపరిపాలన గావించాడో అటులనే మీయందున్న దురాలోచనలు, దుర్గుణములు, దుర్బుద్ధులను సంహరించి సద్గుణములను, సదాచారములను పోషించటానికి కృషి చేయండి. ఇదే ప్రతి మానవుడు

ప్రతీక్షణమందు చేయవలసిన యజ్ఞము.

కనుక యజ్ఞమనగా కొన్ని వేదికలు నిర్మించి, ఋత్విక్కులనాహ్వానించి తద్వారా అనేక ద్రవ్యములనంతా ఆహుతి చేసి యీ విధముగా మంత్రములుచ్ఛరించటం మాత్రమే కాదు. కేవలం ఉపాధి భేదముల చేతనే మనం యిన్ని విధములైన అపమార్గములను పడుతున్నాము. ఉపాధి భేదములను మనం త్యజించినప్పుడు అందరియందు దివ్యత్వమైన చైతన్యము ఒకటిగానే వుంటుంది. ఇకబడు సజాతి, విజాతి, స్వగత భేదములున్నాయి. సజాతి అనగా ఏమిటి? మనం ప్రాకృతంగా చూచినప్పుడు చెట్టు చెట్టు యీ రెండు స్వజాతి. అది యే చెట్టైనా కాని. వేప చెట్టు కావచ్చు. మామిడి చెట్టు కావచ్చు. రావి చెట్టు కావచ్చు. చెట్టు చెట్టే. అది స్వజాతి భేదముగాని పేర్లు వేరువేరుగా వుండవచ్చును. ఇది వృక్ష జాతి. ఇది సజాతి. జాతి అనగా యిక్కడ వృక్షమునకు, ఒకశిలకు సంబంధము లేదు. ఇది విజాతి భేదమన్నారు. స్వగత భేదమనగా యేమిటి? మనం ఒక విత్తనం నాటినప్పటికి అది అనేక కొమ్మలతో రెమ్మలతో అభివృద్ధి అవుతుంది. అది శాఖోపశాఖలుగా రూపొందుతుంది. ఇందులో ఎన్నో ఆకులు, పూలు, కాయలు రూపొందింప చేస్తుంది. ఐతే ఎన్ని కొమ్మలుండినా, ఎన్ని ఆకులు, ఎన్ని పూలు, ఎన్ని కాయలుండినప్పటికి యివన్నీ ఒక విత్తనమునకు సంబంధించినవే గాని అన్యము కాదు. దీనినే స్వగత భేదమన్నారు. ఈ మూడింటి యొక్క అంతరార్థము ఏమిటి? రూపనామములు తీసివేస్తే అన్నింటి యందు వున్న చైతన్యమొక్కటే. ఇది ఆకు అన్నాము. ఈ ఆకు ఎక్కడనుండి వచ్చింది. ఆ విత్తనము నుండే వచ్చింది. ఇది పువ్వు అన్నాము. దాని రూపనామములు వేరుగా వుండవచ్చును. కాని విత్తనం ఒకటే. ఏకత్వములో అనేకత్వము యిమిడి వుంటున్నది అనే సత్యానికి యిదే ప్రమాణము. ఇలాంటి విషయములను వేదము అనేకంగా నిరూపిస్తూ వచ్చింది. కాని యీ వేదమునందున్న అంతరార్థములుగాని మానవుడు గుర్తించటానికి తగిన ప్రయత్నము చేయటం లేదు. కనుక ప్రతి దాని యందు కూడను ఒకదానికొకటి సన్నిహిత సంబంధ బాంధవ్యమేర్పడి వుంటుంది. సూర్యుడే లేకపోతే భూమియు లేదు. భూమి లేకుంటే చంద్రుడే లేడు. సూర్య భూమి, చంద్రులే లేక జగత్తు లేదు. ఈ రూపనామములు వేరువేరు అయినప్పటికిని దివ్యత్వము ఒకటిగానే వుంటుంది. అట్టి దివ్యత్వాన్ని గుర్తింపచేసే నిమిత్తము పూర్వము యీ యజ్ఞయాగాదులు ప్రారంభమయ్యాయి. కానీ దీని యొక్క అంతరార్థమును మానవులెవరు విచారించక కేవలము బాహ్యమైన కర్మలను మాత్రం దృష్టియందుంచుకొని యిదంతా కేవలము ధనము వ్యర్థం చేస్తున్నారనే భావములో దీనిని తిరస్కరిస్తున్నారు. మానవత్వమునకు మించిన దివ్యత్వము మరొకటి లేదు.

మానవుని కంటె గొప్పవాడు మరొకడు యీ జగత్తులో లేడు. మానవుని కంటె విలువైన వస్తువు యీ జగత్తులో మరొకటి లేదు. ఒక వస్తువు కాని, ఒక వజ్రము

606108907

నకుగాని లేక బంగారమునకు గాని వెలకట్టే వాడెవరు? మానవుడే. ప్రపంచములో ఏవిలువైన పదార్థములున్నాయో, వానికి విలువకట్టే వాడు మానవుడే. అన్నింటికి విలువ కట్టే మానవునకీనాడు విలువ లేకుండా పోయింది. కారణమేమనగా తనయొక్క స్వరూపాన్ని తాను మరచిపోవటమే. స్వరూపాన్ని మరచిపోవటం కేవలము ఒకవిధమైన భావరూపాన్ని మాత్రం విశ్వసించి తద్వారా బాహ్యమైన ఉపాధినే ఆశ్రయిస్తూ వస్తున్నారు. ఈ అనిత్యము, అశాశ్వతము అయిన దేహమునందే నిత్యసత్య నిర్మలమైన దివ్యత్వము వున్నదనే సత్యాన్ని వారు గుర్తించటం లేదు. దేహమునందే దేహి వున్నాడు. శరీరమునందే శరీరి వున్నాడు. ఈ క్షేత్రమునందే క్షేత్రజ్ఞుడు వున్నాడు. క్షేత్రజ్ఞుడే లేకపోతే క్షేత్రమునకేమి విలువ లేదు. కాని క్షేత్రమనే బండికి విలువ యిస్తున్నారు. కాని క్షేత్రజ్ఞుడనే గుర్రమును పోషించటం లేదు. గుర్రమును వెనుక పెట్టి బండి ముందు వేస్తే ప్రయాణం ఎలా సాగుతుంది. అదే విధముగనే యీనాడు దివ్యత్వమైన ఆత్మతత్వాన్ని వెనుక పెట్టి కేవలం బండివంటి దేహమును మాత్రమే ముందు పెట్టి జీవితయాత్ర సలుపుతున్నాడు. తద్వారా గమ్యమును వీడు చేరలేక పోతున్నాడు. కనుక మానవత్వంలో వున్న పవిత్రతను యీ వేదము ద్వారా మనం గుర్తించటానికి ప్రయత్నించాలి. వేదమనగా విద్యాస్వరూపమే. విద్యుత్ కిరణము విద్యాసారము. వేదము, వేదాంగము వేదవిదుడు ముగ్గురూ ఒకటే అనే ఏకత్వాన్ని నిరూపిస్తూ వచ్చింది. ధ్యానము, ధ్యేయము, ధ్యాస యీ ఏకత్వమే విధముగా మనకు సంభవిస్తుందో అదే విధముగనే దివ్యత్వము పవిత్రము ప్రకృతి యొక్క తత్వము మూడింటి యొక్క యేకత్వం మనకు ప్రాప్తిస్తుంది.

కనుక ప్రతి మానవుడు తనలో ఆవిర్భవించే భావములకు, భావములకు తగిన పలుకులకు, పలుకులకు తగిన క్రియలకు మూడింటికి సంబంధమేర్పరచుకోవాలి. దీనినే The proper study of mankind is man. అన్నారు. మనిషి అంటే ఏమిటి? తన తలంపులు, పలుకులు, క్రియలు మూడింటిని ఏకం గావించాలి. అదియే వేద మంత్రమునందు

త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం
త్రిజన్మ పాప సంహారం ఏకబిల్వం శివార్పణం.

అన్నారు. దీనిని పురస్కరించుకొని చెప్పారు. పత్రం - మన దేహము. పుష్పం - మన హృదయం ఫలం - మన మనస్సు. తోయం - మన ఆనందభాష్పములు. వీటిని భగవదర్పితము గావించమని కోరింది. ఈనాడు లోకములో ధనవంతుడున్నాడు. గుణవంతుడున్నాడు. బలవంతుడున్నాడు. విద్యావంతుడున్నాడు కానీ ఆత్మవంతుడు కనుపించటం లేదు. ఆత్మ భావమును మరచి యీ ధనము, బలము గుణము ఎంతో కాలం నిన్ను ఆశ్రయిస్తాయి మన దేహబలమనేది కేవలం తెల్లవారి విచ్చిన పుష్పం సాయంకాలమునకు వాడిపోయినట్లుగా దేహం వృద్ధాప్యం పొందుతుంది. మన దేహము యొక్క బలము, ఆస్తిపాస్తులు

ఎప్పుడు పోతాయో ఎప్పుడు వస్తాయో తెలీదు. కనుక యివన్నీ అశాశ్వతమైనవే. ఇలు వంటి అశాశ్వతాన్ని శాశ్వతంగా విశ్వసించి, శాశ్వతాన్ని అశాశ్వతముగా భావించి మానవుడిన్ని విధములైన దుఃఖములకు గురౌతున్నాడు.

ప్రేమ స్వరూపులారా!

ఎద్ది కలదనుచుంటిరో అద్ది లేదు
ఎద్ది లేదనుచుంటిరో అద్ది కలదు
వున్న దొక్కటే దైవంబు ఎన్నటికిని
మరువబోకు డిట్టి మంచి మాట.

వున్నది వున్నది అనుకుంటున్నాం. వున్నదంతా కూడా లేనిదే. ఎంతవరకు మనకు సత్యంగా వుంటుంది. జాగ్రత్తలో చూచినది నిద్రలో మరచిపోతున్నాము. స్వప్నములో కనుపించిన ది జాగ్రత్త రాగానే అలక్ష్యము చేస్తున్నాము. జాగ్రత్తది స్వప్నంలో లేదు. స్వప్నమది జాగ్రత్త లో లేదు. ఒక్క దినములోనే రెండు అవస్థలు ఒకదానికొకటి విరుద్ధముగా కలుగుతు న్నాయి. ఇట్టి క్షణభంగురమైన సత్యాన్ని మనం విశ్వసించి శాశ్వతమైన సత్యాన్ని విస్మరిం చటం మానవత్వానికి తగిన అర్థం కాదు. కనుకనే వేదములన్నీ యిట్టి దివ్యత్వాన్ని ప్రబోధిం చి మానవుని మానవుడుగా జీవించమని కోరుతూ వచ్చింది. ఈవిధమైన అంతరార్థము లతో కూడిన వేదము కేవలము ఒక మంత్రము మాత్రమే కాక దానికి తగిన ప్రబోధలు కూడా యిందులో యిమిడి వున్నాయి. కర్మోపాసన, జ్ఞాన కాండలన్ని కూడను వేదములో ప్రధానమైన రాజ మార్గములు. సాటి మానవుల యొక్క సహజత్వము, సానుభూతి చూపు టే మానవుని యొక్క ప్రధాన తత్వమన్నారు. తోటి మానవులు బాధపడుతుండగా వారి ని చూచి సరియైన ఆదర్శమును అందించాలి. సహకారమును, సానుభూతిని చూపాలి. ఈ విధమైన భావము లీనాడు మానవుని యందు కనుపించుటం లేదు. కేవలం స్వార్థ ము, స్వప్రయోజనము పెరిగిపోయి విశాల భావములీనాడు విస్మరించిపోయినారు. మా నవుడు విశాలమైన తత్వాన్ని అర్థం చేసుకోవాలి.

వింటున్నాము దినము యెన్నో మంచి మాటలు. చూస్తున్నాము ఎన్నియో మంచి కర్మలు. కాని ఒక్కటైనా మనలో నిలువకల్గుతోందా? లేదు. కేవలం యీవిధమైన జీవి తము ఎన్ని చూచినా వినినా ఎంతకాలము వుండినప్పటికిని నిరుపయోగమైనవే. ఒకం చెట్టైనా మనలో జీర్ణింప చేసుకునే శక్తిని మనం సంపాదించాలి. మానవత్వం చాలా పవి త్రమైనది. దివ్యమైనది. జీవించ తగినది. చాలా విలువైనది. ఇట్టి విలువైన జీవితాన్ని మనం వ్యర్థము గావించుకోరాదు. భౌతికమైన సుఖసంతోషములే ప్రధానముగా ఎంచ రాదు. ఇవి కదలిపోయే మేఘముల వంటివి. చెదిరిపోయే మేఘముల వంటివి. దీనిని ఆధారముగా తీసుకుని మనము జీవితం సాగించుటం సరియైనది కాదు. ఇరా యీ లోకములో మనం వుండవలసిందే. ఈ లోకమును వదలుటకు వీలు కాదు.

దీనిని ఒక ఆధారంగా ఆదర్శంగా తీసుకుని జీవితమనే సాగరం దాటటానికి ప్రయత్నించాలి. నావను ఆధారం చేసుకుని గట్టునకెలా చేరుతున్నామో, దేహమనే నావను ఆధారంగా చేసుకొని దివ్యత్వమనే ఆత్మ తత్వాన్ని మనం చేరాలి. ఇదే మన ప్రయాణము యొక్క రహస్యము ఎక్కడ నుండి వచ్చాము ! ఎక్కడికి పోతున్నాము? ఏమి చేస్తున్నాము? ఇది ఏమాత్రము మనం విచారించటం లేదు. చిన్న విషయాలలో మీరు యింతో విచారించవచ్చు. ఒకరికి letter వ్రాసి దానిని కవరులో పెట్టి అంటించి దానిని పోస్టు బాక్సులో వేస్తే అది ఎక్కడికి పోతుంది. జాబేమో వ్రాసినావు. విలువైన కవరు లోనే పెట్టినావు. పోస్టుచేశావు కాని అందులో from address లేదు to address లేదు. from address వుంటే తిరిగి నీకైనా చేరుతుంది. లేక to address వుంటే వానికైనా చేరిపోతుంది. రెండు లేని letters ఏమి చేస్తారు. dead letter office లో వేస్తారు. కాల్చివేస్తారు. కనుక మీ జీవితములంతా యిదే రీతిగా వుంటున్నాయి. మనము ఎక్కడ నుండి వచ్చాము మనం తెలుసుకోటం లేదు. మన ప్రవర్తన ఆధారము చేసుకొని మనము ఎక్కడ పోగలమని టు ఎడ్రస్సును తెలుసుకోటం లేదు. వున్నచోటే వున్నాము. ఈ విధముగా వ్యర్థము గావించుకుంటున్నాము. ఇది సరియైనది కాదు. విచారణ చెయ్యాలి. చిన్న చిన్న విషయాలు సైన్సులో పరిశోధన చేస్తూ వుంటారు.

ఈ భౌతికమైన పరిశోధనలో వచ్చిన ఫలితము యేమిటుంది మనకు. మంచి ఉత్తమ డిగ్రీని పొందవచ్చును. ఉత్తమ ఉద్యోగములు చేయవచ్చును. కావలసినంత ధనము సంపాదించవచ్చును. ఆ ధనముతో భౌతికమైన సుఖములు పొందవచ్చును. అంతేనా దీనియొక్క లక్ష్యము. ఇదేనా జీవిత అంతరార్థము. కాదు కాదు కాదు. మనము వచ్చినటువంటి తత్వము చక్కగా అర్థము చేసుకోటానికి ప్రయత్నించాలి. ఎవరికి వారంతా what is the purpose of life ఈ జీవితము యొక్క రహస్యము ఏమిటి? అంతరార్థము ఏమిటి అని ప్రశ్నించుకోవాలి. ఏ ప్రశ్నలు వేసుకోటం లేదు. ఏ విషయమును మనం విచారించటము లేదు. తనకు తగిన విషయాన్ని అనవసరమైన విషయాలని అంతయూ డను ప్రొద్దున్న newspaper వచ్చిందంటే గంటసేపు దానిని కూర్చుని చదువుతూ వుంటావు ఏ దేశములో ఏ రాష్ట్రములో ఎవరివల్ల యేమి జరిగిందో అన్న తెలుసుకుంటూ వుటాం. తననుంచి న్యూస్ వస్తున్నదా న్యూసెన్సు వస్తున్నదా చూచుకోటం లేదు. తన దానిని తాను చూచుకోకుండా జగత్తు యొక్క విషయాన్ని తెలుసుకుంటే వచ్చే ఫలిత మేమిటి? కనకనే వేదాంతమునందు తనను తాను తెలుసుకోమని చెప్పింది. తనను తాను తెలుసుకున్న వాడే సర్వము తెలుసుకోగలడు.

ఈ తెలుసుకునే విధానం తగిన వారివద్ద చేరి సలహాను తీసుకొని తద్వారా మీరు సరియైన అర్థాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి లేక యిదన్న వ్యర్థమని మీరు భావించినప్పుడు కేవలము విశ్వాసమైనా పెంచుకోవాలి. ఏ విశ్వాసాన్ని ! దైవ విశ్వాసము లేకపోయినా ఫరవాలేదు. మిమ్మల్ని మీరు విశ్వసించే విశ్వాసము పెంచుకోవాలి

తనను తాను నమ్మనివాడు ఎవ్వరినీ నమ్మలేడు. తనను తాను విశ్వసించటమే పెద్ద నమ్మకము. తద్వారా ఇంక దేనినైనా విశ్వసించవచ్చు. ఈనాడు దైవమును విశ్వసించని వాడెవరంటే తనను తాను విశ్వసించని వాడే దైవాన్ని విశ్వసించడు. కనుక విశ్వాసమే మనశ్వాసముగా భావించాలి. విశ్వాసము లేనివానికి శ్వాసము వుండదు. అలాంటి వాడు Living death జీవించి మృతుడైనవాడు. కనుక ఆవిధముగా మనము జీవించరాదు దివ్యమైన భావాన్ని మనం అభివృద్ధి గావించుకోవాలి. కనుక

భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే
సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి డుకృఞ్ కరణే.

అటులనే ఈ విద్యలన్నీ కూడను అంత్యములో మరెంత స్మరించినప్పటికిని ఇమి నిమ్మలను రక్షించవు. ఒక్క దైవమే సర్వరక్షకుడు. రక్షించే దైవాన్ని మనము స్మరించాలి. కాని బాధించే వానిని స్మరించటం చేత మరింత బంధనలో మునిగిపోతాము. కనుక ఈ భావమును దాటే మార్గానికి ప్రయత్నించండి.